సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



నల్లబెల్లం స్వాధీనం
తొర్రూరులో గుడుంబా తయారీ కేంద్రాలపై దాడి చేసి 90 కిలోల నల్లబెల్లం, పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.
- 8లో▸



ప్రాణం తీసిన అప్పు
అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడిగినందుకు ఓ రైల్వే ఉద్యోగిని సమీప బంధువు మిత్రుడితో కలిసి దాడి చేసి హత్య చేశాడు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.7°/15.4°

వాతావరణం
జిల్లాలో ఉదయం చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం పొడి వాతావరణం ఉండి, సాయంత్రం తిరిగి చలి తీవ్రత ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

కేంద్రం బృందం సందర్శన



డోర్నకల్: మండలంలోని మన్నెగూడెం, రావిగూడెం గ్రామాలను కేంద్ర మానిటరింగ్ అధికారులు గురువారం సందర్శించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం గ్రామపంచాయితీ కార్యాలయాల్లో ఉపాధి పనులు, గ్రామపంచాయితీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పింఛన్ లబ్ధిదారుల రికార్డులను పరిశీలించి, డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర మానిటరింగ్ అధికారులు జోసెఫ్, వినోద్‌కుమార్, ఎంపీడీఓ అపర్ణ, సర్పంచులు కొండపల్లి రాధిక, మందా వరలక్ష్మి, ఎంపీఓ మున్వర్‌బేగ్, పంచాయితీరాజ్ డీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

మహబూబాబాద్: ప్రభుత్వ అభివృద్ధి పథకాల్లో నిర్దేశించిన ప్రతి లక్ష్యాన్ని తప్పనిసరి సాధించాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో మన ఊరు మన బడి, కంటి వెలుగు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో నిర్మించిన మోడల్ స్కూల్స్ త్వరగా ప్రారంభించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వినియోగించుకునేలా నిరుపేద కూలీలను ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' పరిశీలన



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ గురువారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఏ విధంగా కంటి పరీక్షలు చేస్తున్నారని డీఎంహెచ్‌ఓ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేత



మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై కుటుంబానికి ఎస్పీ శరత్ చంద్ర పవార్ రూ.32 లక్షల పోలీస్ భద్రతా చెక్కును గురువారం అందజేశారు. ఎస్సై భిక్షపతి మరిపెడ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై కొన్ని నెలల క్రితం మృతిచెందాడు. ఆయన కుటుంబానికి పోలీస్ భద్రతలో భాగంగా రూ.32 లక్షలు రాగా ఆ చెక్కును ఎస్పీ తన కార్యాలయంలో భిక్షపతి భార్య నరసమ్మకు అందించారు.

కలెక్టర్‌కు రిపోర్ట్ చేశాం

గూడూరు: మండలంలోని లైన్‌తండా అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన చిన్నారుల అస్వస్థత ఘటన వివరాలను జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేసినట్లు సీడీపీఓ నీలోఫర్ అజ్మీ తెలిపారు. సీడీపీఓ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. లైన్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అదే రోజు ఇద్దరు చిన్నారులు కోలుకోగా, మరో బాలుడు జశ్వంత్ హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స పొందాడు. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించిన డాక్టర్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం కలుషిత ఆహారం వల్ల కాదని, ఉదయమే తిన్న మరో పదార్థాలతో జశ్వంత్ అస్వస్థతకు గురైనట్లు ఉందని వెల్లడించారు. అంతకు ముందే అంగన్‌వాడీ టీచర్, ఆయాకు షోకాజ్ నోటీస్ ఇచ్చామని, వారిచ్చిన వివరాలను, డాక్టర్ ఇచ్చిన రిపోర్టుతో జతచేసి డీడబ్ల్యూఓ నర్మద జిల్లా కలెక్టర్‌కు పంపించారని తెలిపారు. హనుమకొండలో చికిత్స అనంతరం బాలుడు జశ్వంత్ ఇంటికి చేరుకున్నాడని తెలిపారు.

కాంగ్రెస్‌లో కమిటీల లొల్లి

అభిప్రాయాల సేకరణలో కాంగ్రెస్ నేతలు
- అనుచరులకు పదవుల కోసం ప్రయత్నాలు
- మండల స్థాయి నుంచి కమిటీలు

సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మానుకోటలో మారుతున్న పరిణామాలు, నాయకుల మధ్య వర్గపోరుతో పార్టీ అంపశయ్యపై పయనించే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉన్న జిల్లాల జాబితాలో మహబుబాబాద్ కూడా ఉండటంతో ఇక్కడ పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని భావించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి నుంచి కమిటీలు వేస్తుంది. అయితే మూడు వర్గాలు ఆరు గ్రూపులుగా ఉన్న నాయకులు కమిటీల్లో తమ అనుచరులకు స్థానం కల్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇది కాస్తా ముదిరి పాకాన పడి కమిటీల ఏర్పాటులో లొల్లులు మొదలయ్యాయి.

ప్రజాభిప్రాయ సేకరణ

మండల, మున్సిపాలిటీల కమిటీలు వేసే పనిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. అయితే ఇప్పటికే జిల్లా కమిటీ ఏర్పాటు సందర్భంగా చివరి వరకు ఉత్కంఠగా ఉండి చివరకు పాత అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డికే పగ్గాలు అప్పగించారు. ఈయన నేతృత్వంలో కమిటీలు వేసే ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతీ మండలంలోని మండల పార్టీ అధ్యక్షుల రేసులో ఉన్న నాయకుల పేర్లను తీసుకున్నారు. పలు గ్రామాల అధ్యక్షులు, ముఖ్య నాయకులకు ఫోన్లు చేసి మండల పార్టీని బలోపేతం చేసేందుకు ఎవరైతే బాగుంటారనే అభిప్రాయాలు సేకరించారు.

అనుచరుల కోసం ఆరాటం

నాయకత్వం అనుకూలంగా ఉంటేనే ఆయా మండలాల్లో పార్టీ బలయంగా ఉంటుందనే ఆలోచనతో నాయకులు తమ అనుచరులను అధ్యక్షులుగా చేసే పనిలో ఉన్నారు. ఇలా మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ పడుతున్న మురళీనాయక్, బలరాం నాయక్, బెల్లయ్య నాయక్‌లు తమ అనుచరుల పేర్లు చెబుతూ వారికే మండల పార్టీ అధ్యక్షుల పదవులు ఇవ్వాలని అధినాయకత్వాన్ని కోరుతున్నట్లు సమాచారం. అయితే జిల్లా పార్టీ అధ్యక్షుడి నిర్ణయమే తుది నిర్ణయం కావడంతో జిల్లా పార్టీ నాయకత్వంలో అనుకూలంగా ఉన్న వారు ఆయన వద్దకే వెళ్లి తమ అనుచరుల పేర్లు చెబుతుండగా.. ఇక్కడ అనుకూలంగా లేని వారు రాజధాని స్థాయిలో పైరవీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా గూడూరు, కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లో పలువురు నాయకుల మధ్య పోటీ నెలకొంది. జిల్లా పార్టీకి ఆయువు పట్టుగా ఉండే మహబూబాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల పోటీలో కూడా నాయకులు పోటాపోటీగా పైరవీలు ప్రారంభించారు. అయితే పార్టీకి విధేయులుగా ఉంటూ.. కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకుడిని ఎంపిక చేస్తే బాగుంటుందని అధిష్టానం కూడా తేల్చి చెప్పినట్లు సమాచారం.

డోర్నకల్‌లో పోటా పోటీ..

డోర్నకల్ నియోకవర్గంలోని డోర్నకల్, మరిపెడ, కురవి, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఎంపికలో పోటాపోటీగా నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక వైపు రాంచంద్రానాయక్, మరోవైపు నెహ్రూనాయక్‌లు తమ అనుచరులను మండల పార్టీ అధ్యక్షులుగా నియమించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కార్యకర్తల అభిప్రాయ సేకరణలో సానుకూలంగా ఉన్నవారు.. తమ అనుచరులకే మండల పార్టీ పగ్గాలు అప్పగిస్తారని చెబుతుండగా.. మరికొందరు మాత్రం అధిష్టానానికి జాబితాను ఇచ్చి వారికే మండల పార్టీ పగ్గాలు అప్పగించాలని కోరుతున్నటు తెలిసింది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్‌తో పోటీ పడలేక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్న పార్టీని మళ్లీ రెండు, మూడు వర్గాలుగా విభజిస్తే రాబోయే ఎన్నికల్లో నష్టం జరుగుతుందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తారో.. పైరవీలు చేసిన వారికి పదవులు కట్టబెడతారో వేచి చూడాల్సిందే.!

గద్దెల ప్రాంగణంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జాతర.. జనం

భక్తులతో కిటకిటలాడిన మేడారం

- ఎస్‌ఎస్ తాడ్వాయి

మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతర ప్రాంగణం రెండో రోజు గురువారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జంపన్న వాగులో స్నానా లు ఆచరించారు. మొక్కులున్న భక్తులు తలనీలాలు సమర్పించి, ఎత్తు బంగారంతో తల్లుల గద్దెల వద్దకు చేరుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చిన తల్లిని భక్తిభావంతో కొలిచి మొక్కులు చెల్లించుకున్నారు.

- వివరాలు 8లో▸

మోదీ పాలనలో వెలుగొందుతున్న భారత్

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి

దంతాలపల్లి: ప్రధాని మోదీ పాలనలో ప్రపంచంలో భారత్ వెలుగొందుతున్నదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్య తరగతి ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ రూపకల్పనతో ప్రపంచానికే మోదీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, కట్ల సుధాకర్, కొమురయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనువాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శృతి

రాజన్న బిడ్డను.. ఆశీర్వదించండి

అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తా..
- ప్రజాప్రస్థాన యాత్రలో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

చెన్నారావుపేట: 'వైఎస్.రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన తేవడానికే రాజన్న బిడ్డ మీ ముందుకు వచ్చింది.. ఆశీర్వదించండి, అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తా' అని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం శంకరంతండాలో రెండు నెలల క్రితం ఆగిన చోట నుంచే గురువారం సాయంత్రం 4.30 గంటలకు వైఎస్.షర్మిల ప్రజాప్రస్థాన పాదయాత్ర ప్రారంభమైంది. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలకగా.. ప్రజలు పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్షన్లు వస్తున్నాయి.. కేసీఆర్ మళ్లీ వస్తాడు.. వారి ఎమ్మెల్యేలూ వస్తారు.. ఓటు వేసి మోసపోకండి అన్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో మీ ఓటు విలువైనది. ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అనంతరం పాదయాత్ర తోపనగడ్డ మీదుగా నెక్కొండకు చేరుకుంది. కాగా.. శంకరం తండాకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి నాయకులు వైఎస్.షర్మిల సమక్షంలో వైఎస్సార్ టీపీలో చేరారు.

పథకాల ఘనత రాజన్నదే..

నెక్కొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. షర్మిల చేపట్టిన ప్రజా ప్రస్థాన పాదయాత్ర గురువారం సూరిపెల్లి క్రాస్ రోడ్డు నుంచి తోపనగడ్డ తండా మీదుగా నెక్కొండకు చేరింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ సంక్షేమ పాలన కోసం ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కుటుంబంలో ఎంత మంది అర్హులుంటే అందరికి రూ.3వేల పింఛన్ అందిస్తామన్నారు. నెక్కొండలో ఎక్కడైనా డబుల్ బెడ్‌రూం ఒక్కటైనా ఇచ్చారా? అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన సాగుతుంటే ప్రతిపక్షాలు కాంగ్రెస్, బీజేపీలు ఏనాడైనా ప్రశ్నించాయా? అని ఆమె ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ రెండు జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు భూక్య లాలునాయక్, నర్సంపేట, నెక్కొండ, చెన్నారావుపేట మండలాల అధ్యక్షులు నూనె నర్సయ్య, సురేందర్, జక్క వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు అశోక్‌నాయక్, అలువాల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షర్మిల

బడి.. నూతన ఒరవడి

'మన ఊరు-మన బడి'తో సరికొత్త సొబగులు
- 'కార్పొరేట్'ను తలపిస్తున్న సర్కారు పాఠశాలలు
- పల్లెలు, పట్టణాల్లో ప్రారంభోత్సవాల సందడి

సాక్షిప్రతినిధి, వరంగల్: సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులందరూ సర్కారు బడుల వైపు పరిగెత్తేలా కొత్త రూపును తీసుకొస్తోంది. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల్లో మన ఊరు–మన బడి కింద అభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవడంతో పాఠశాలలకు మహర్దశ పడుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,875 స్కూళ్లకు.. 2,984 పాఠశాలలను గుర్తించి.. తొలి విడతలో 964 బడుల్లో పనులు చేపట్టింది. రూ.241కోట్లు ఖర్చు చేసేందుకు అంచనా వేసింది. అయితే దశలవారీగా పూర్తవుతున్న పనుల్లో మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉంది. పనులు పూర్తయి కొత్త రూపును సంతరించుకున్న పాఠశాలలు అధికారిక వేడుకలతో సందడి చేస్తున్నాయి.

జిల్లాలవారీగా ఇదీ పరిస్థితి..

మన ఊరు–మన బడి కింద ప్రహరీ, అదనపు తరగతి గదులు, విశాలమైన డైనింగ్ హాళ్లు, కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, మంచినీరు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, కూర్చునేందుకు బెంచీలు, భవనాలకు రంగులు, డిజిటల్ బోర్డులు, గ్రీన్ చాక్‌బోర్డులు వంటి 12 రకాల పనులు చేపట్టారు.

- హనుమకొండ జిల్లాలో 176 పాఠశాలలను ఎంపిక చేయగా.. రూ.30లక్షల బడ్జెట్ కన్నా ఎక్కువగా ఉన్న 42 స్కూళ్లను టెండర్ కాల్ కోసం వదిలిపెట్టారు. మిగతా 133 పాఠశాలల్లో ఎస్‌ఎంసీలతో పనులను మొదలు పెట్టారు.13 పూర్తి కాగా.. మిగతా పాఠశాలల్లో పనులు వివిధ స్థాయిల్లో సాగుతున్నాయి.
- వరంగల్ జిల్లాలో 223 పాఠశాలలకు ప్రభుత్వం సుమారు రూ.58కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. వీటిలో రూ.30లక్షలలోపు పనులు చేపట్టి 17 పూర్తి చేయగా.. 163 పాఠశాలల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. అభివృద్ధి పనులు చేసే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇప్పటికే అడ్వాన్స్‌గా రివాల్వింగ్ ఫండ్ నుంచి రూ.4.08కోట్లు చెల్లించింది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 149 పాఠశాలలను ఎంపిక చేసి రూ.41.30కోట్లు మంజూరు చేశారు. 33 పాఠశాలల్లో మొత్తం పనులు పూర్తయ్యాయి. మిగతా చోట్ల పనులు పూర్తి చేసేందుకు అధికారులు తొందర పెడుతున్నారు.
- మహబూబాబాద్ జిల్లాలో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద 316 బడులు మంజూరు కాగా.. తొలివిడతగా 116 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. డిసెంబర్ 31లోగా జిల్లావ్యాప్తంగా 32 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా.. నెల్లికుదురులో అధికారికంగా ప్రారంభించారు. మిగతా చోట్లపనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి.
- ములుగు జిల్లాలో 125 పాఠశాలలకు ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. 17 చోట్ల పనులు పూర్తి కాగా.. 50 పాఠశాలల్లో 90 శాతం మేర పూర్తి కాగా.. 38 చోట్ల 50–60 శాతం పనులు పూర్తి కావొచ్చాయని, 28 పాఠశాలల్లో ఇటీవలే ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.
- జనగామ జిల్లాలో 176 పాఠశాలలు ఎంపిక కాగా.. వీటి అభివృద్ధికి రూ.37,83,61,867 ఖర్చు చేస్తున్నారు. 31 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా.. రూ.30లక్షలలోపు పనులు చేపట్టిన 131 పాఠశాలల్లో వివిధ స్థాయిల్లో సాగుతున్నాయి.



కొత్తరూపుతో నెల్లికుదురు పాఠశాల

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఇదీ పరిస్థితి..

గుర్తించిన మొత్తం పాఠశాలలు	2,984
తొలి విడతలో మరమ్మతులు చేసేవి	964
అంచనా వ్యయం..	రూ. 241కోట్లు
పనులు పూర్తయినవి	146
వివిధ దశల్లో ఉన్నవి	818

సుందరంగా తీర్చిదిద్దారు..



మా పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 150 మంది విద్యార్థులు ఉన్నారు. ఏడుగురు ఉపాధ్యాయులం బోధిస్తున్నాం. మన ఊరు–మన బడి కింద పూర్తిస్థాయిలో తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి వంటి మౌలిక వసతులు కల్పించారు. డెస్క్ బెంచీలు కూడా వచ్చాయి.
– ఇంద్రసేనారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, నెల్లికుదురు

ప్రైవేటు స్కూల్‌లా ఉంది..



నేను ఒకటో తరగతి నుంచి ఈ పాఠశాలలో చదువుతున్నాను. అప్పుడు సౌకర్యాలు సరిగ్గా లేవు. మన ఊరు–మన బడి కింద మా పాఠశాలలో తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు బాగు చేశారు. ప్రైవేటు పాఠశాలల కంటే బాగుంది. చదువుకోవాలనే ఆసక్తి పెరిగింది.
– గోనె అమృత వర్షిణి, 5వ తరగతి, నెల్లికుదురు పాఠశాల

కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

మహబూబాబాద్ రూరల్: రాజీమార్గమే రాజమార్గమని, కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. ఈ నెల 11వ తేదీన మెగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీపడేందుకు అవకాశం ఉన్న అన్ని కేసులను లోక్‌అదాలత్‌లో ఇరువర్గాలను పిలిచి మాట్లాడి రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. లోక్‌అదాలత్‌లో ఒకసారి తీర్పు వచ్చాక పై కోర్టులకు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు సదయ్య, రఘు, సీఐలు సతీష్, రవికుమార్, వెంకటరత్నం, సాగర్, బాలాజీ, సత్యనారాయణ, యాసిన్, డీసీఆర్‌బీ సీఐ బాలాజీ వరప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాటిల్ వసంత్

బాలికల రక్షణ కోసం షీ టీం

మహబూబాబాద్ అర్బన్: బాల బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీసీఎస్ సీఐ మోహన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం విద్యా భారతి పాఠశాలలో గురువారం విద్యార్థులకు షీ టీం, భరోసా, మానవ అక్రమ రవాణా, ఉమెన్ సెఫ్టీ, సెక్యూరిటీ క్యూఆర్ కోడ్ పిటిషన్, సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలు, బాల్య వివాహాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నరోత్తం రెడ్డి, షీటీమ్ ఎస్సై సునంద, ఏఎస్సై ఆనంద్, పీసీలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు సహకరించాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్: మిర్చి రైతులకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్ అధ్యక్షతన జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా వినియోగదారుల సమాచార అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రంలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాలు మొదలగు అంశాలపై నివేదిక అందచేయాలన్నారు. మిర్చి పంటకు గిట్టుబాటు దరను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా మిర్చి మార్కెట్ యార్డులలో రైతులకు తాగు నీరు,ఇతరత్రా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. యార్డులలో విద్యుత్ ఇతరత్రా సమస్యలు లేకుండా చూసుకో వాలని తెలిపారు. జిల్లాలోని హాస్టళ్లలో నిల్వ ఉన్న బియ్యాన్ని సంబంధిత అధికారులతో, పాఠశాలల హెచ్‌ఎంలతో మాట్లాడి 20 నుంచి 25 రోజుల్లో క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, డీసీఎస్‌ఓ నర్సింగరావు, డీసీఐసీ ఇన్‌చార్జ్ సుధాకర్, డీసీఐసీ, మెంబర్ జానీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డేవిడ్

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ సమావేశం గునిగంటి రాజన్న అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య స్మారక భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అడవులను కార్పొరేట్ సంస్థలకు దారదత్తం చేసే అటవీ హక్కుల సంరక్షణ నియమాలు 2022 ను వెంటనే రద్దు చేయాలని కోరారు. 8 ఏండ్ల పరిపాలనలో ఎక్కడ కూడా పట్టాలు ఇవ్వలేదని, పైగా హరితహారం పేరుతో లక్షల ఎకరాల పోడుభూములను ప్రభుత్వం తీసుకుందన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని దొరవారి తిమ్మాపురం ఆదివాసీ గ్రామాన్ని టైగర్ జోన్ పేర ఖాళీ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోడు భూముల సాధన కోసం ఈ నెల 1 నుంచి 13 వరకు మండల, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శలు నిర్వహించాలని, 20వ తేదీన హైదారాబాద్‌లోని మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జి.సక్రు, ఎస్.పుల్లన్న, ఎస్‌కె.బాబు, దేవేందర్, వీరన్న, సత్యనారాయణ, సుధాకర్, తాజ్‌పాషా, యాకయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నియామకం

మరిపెడ రూరల్: హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హెచ్‌ఏసీఏ) చైర్మన్‌గా మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన సర్పంచ్, ప్రముఖ వ్యాపారవేత్త మచ్చ శ్రీనివాసరావు నియామకం అయ్యారు. ఆయనను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మచ్చ శ్రీనివాసరావు నియామకంపై మరిపెడ మండల ఆర్యవైశ్య సంఘం నేతలు, ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు, అభిమానులు అభినందనలు తెలిపారు.



శ్రీనివాసరావు

క్లుప్తంగా

నేటి నుంచి వీనస్ జ్యూవెల్లర్స్‌లో..

● డైమండ్స్ ఎగ్జిబిషన్, సేల్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ రోడ్డులో గల వీనస్ జ్యూవెల్లర్స్ షోరూంలో నేటి నుంచి 5వ తేదీ వరకు డైమండ్స్ ఎగ్జిబిషన్, సేల్ జరుగుతుందని షోరూం చైర్మన్ రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ఒక క్యారెట్‌పై రూ.3వేల ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఐజీఐ సర్టిఫైడ్ డైమండ్స్ ఎగ్జిబిషన్‌లో అమ్మకాలు ఉంటాయని తెలిపారు. 36 సంవత్సరాలుగా ఎందరో కస్టమర్ల ఆదరణ చూరగొన్నామని పేర్కొన్నారు. ఈ డైమండ్స్ ఎగ్జిబిషన్, సేల్ అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని రవిచంద్ర కోరారు.

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

వర్ధన్నపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు డీసీఎం వ్యాన్లు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఓ వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి వరంగల్ నుంచి ఖమ్మం వైపు సెలైన్ బాటిళ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్, వర్ధన్నపేట నుంచి తౌడు లోడుతో వరంగల్‌కు వస్తున్న డీసీఎం వ్యాన్‌లు రెండు ఎదురెదురుగా వస్తున్నాయి. ఇల్లంద గ్రామ శివారులోకి చేరుకోగానే ఢీకొన్నాయి. ఈ క్రమంలో సెలైన్ లోడ్ వ్యాన్ బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తౌడు లోడుతో ఉన్న వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. గాయపడ్డ డ్రైవర్‌ను అంబులెన్సులో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

గీసుకొండ: ఉద్యోగం లేదని మనస్థాపం చెందిన ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. నగరంలోని జాన్‌పాక పెట్రోల్‌పంప్ సమీపంలో సముద్రాల ప్రమీల కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె భర్త సురేశ్ గతంలో చనిపోగా కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు పెళ్లి కాగా కుమారుడు సాయిసూర్య ప్రకాశ్(25) ఇంటర్ వరకు చదువుకుని ఉపాధి కోసం కొంత కాలం బేకరీ మాస్టర్‌గా, మరి కొంత కాలం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేశాడు. అది మానేసి రెండు నెలలుగా జాన్‌పాకలోని ఇంటికి వచ్చి ఉంటున్నాడు. ఇంట్లో తల్లి, బంధువులు ఎవరూ లేని సమయంలో ఉదయం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉద్యోగం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి ప్రమీల ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

పురుగుల మందుతాగి..

నర్సింహులపేట: మండల పరిధిలోని గోల్‌బోడ్కాతండాకు చెందిన బదావత్ బాలాజీ(30)మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందిన గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మంగీలాల్ కథనం ప్రకారం.. బాలాజీ నిత్యం మద్యం తాగేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించారు. ఈ వివరాల మేరకు మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వన దేవతలను మొక్కుతూ..



బంగారంతో వనదేవతల సన్నిధికి వస్తున్న భక్తులు



క్యూలో..



చిన్నారి పుట్టువెంట్రుకలు తీస్తూ..

గద్దెల వద్ద భక్తులు



గద్దె నుంచి వెళ్తూ..



ఎత్తు బంగారంతో యువతి



తల్లులకు సంప్రదాయంగా పూజలు

రెండవ రోజు మేడారం, కన్నెపల్లిలో ప్రత్యేక పూజలు

● భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం
● తరలివచ్చిన వేలాది మంది భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీజాతరకు భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. మండమెలిగె పండుగ సందర్భంగా గురువారం రెండవ రోజు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సమ్మక్క, సారలమ్మ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి మేడారంలోని సమ్మక్క, సారలమ్మ గద్దెలకు చేరుకున్న పూజారులు, రాత్రంతా జాగారం చేశారు. గురువారం ఉదయం పొద్దుపొడవక ముందే 7 గంటల సమయంలో సమ్మక్క పూజారులు సమ్మక్కను గద్దె పై ఉంచిన పూజా సామగ్రిని తీసుకొని డోలువాయిద్యాల, బూరకొమ్ముల శబ్దాల నడుమ మేడారంలోని సమ్మక్క గుడి చేరుకున్నారు. పూజారులు గుడికి వెళ్తున్న దారిలో ఆడపడుచులు ఎదురెళ్లి నీళ్లు ఆరబోసి మొక్కుకున్నారు. పూజారులు తలస్నానాలు ఆచరించిన అనంతరం గుడిలో సమ్మక్క తల్లికి యాటను మొక్కుగా సమర్పించి నైవేద్యంగా పెట్టారు. రెండవ రోజు దూప దీపాలు వెలిగించి పూజలు చేశారు. గద్దెల నుంచి సారలమ్మ పూజారులు కన్నెపల్లి చేరుకున్నారు. సారలమ్మ గుడిని శుద్ధి చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య దూప దీపాలు వెలిగించి అమ్మవారికి యాటను నైవేద్యంగా సమర్పించారు. మేడారం, కన్నెపల్లి ఆదివాసీలు, గ్రామస్తులు అమ్మవారి ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ పూజారులు వారి వారి ఇళ్లలో కూడా అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆకట్టుకుంటున్న మ్యూజియం

మేడారంలోని ఆదివాసీ సమ్మక్క–సారలమ్మ మ్యూజియం భక్తులను ఆకట్టుకుంటోంది. మ్యూజియంలో పురాతన కాలంలో ఆదివాసీలు ఉపయోగించిన పనిముట్లు, వారి జీవన శైలి విధానం, గిరిజన గూడాల చిత్రాలు ఆకర్షణీయంగా నిలిచాయి. మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కురసం రవి భక్తులకు మ్యూజియంలోని ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల తీరును వారికి వివరించారు.

గద్దెల ప్రాంగణంలో..

రెండవ రోజు మండమెలిగె పండుగకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గద్దెల ప్రాంగణం కిక్కిరిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద స్నానాలు ఆచరించారు. సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, ఒడి బియ్యం, చీరసారె కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు యాథావిథిగా కొనసాగింది. భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి పంపించారు. ఈఓ రాజేంద్రం భక్తుల ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. దర్శనం అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావులు జాతరలో భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గద్దెల ప్రాంగణంలో దొంగతనాలు జరగకుండా సీసీఎస్ సీఐ రవీందర్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కొంతమంది అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని వారి వివరాలు సేకరించి వదిలేశారు.



గద్దెల నుంచి వనదేవతలను తీసుకెళ్తున్న పూజారులు



జాతకం చూస్తున్న కోయదొర



జంపన్నవాగులో వరం పడుతూ..



పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



మేడారం వ్యూ



ట్రాక్టర్‌లో వెళ్తూ..

అప్పు తీసిన నిండు ప్రాణం

● కడిపికొండ రైల్వే ఉద్యోగిపై గొడ్డలితో దాడి
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కాజీపేట అర్బన్: అప్పు నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. కడిపికొండలోని గురువారం తెల్లవారు జామున ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించమన్నందుకు సదరు వ్యక్తి గొడ్డలితో దారుణంగా హత్య చేశాడు. మండికొండ సీఐ వేణు, ఎస్సై నర్సింగరావు కథనం ప్రకారం.. కడిపికొండకు చెందిన జిర్ర ప్రదీప్(27) కాజీపేట ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో రైల్వే ఉద్యోగిగా విధులు కొనసాగిస్తున్నాడు. ప్రదీప్ సమీప బంధువైన పెసరు వినయ్‌కి నాలుగేళ్ల క్రితం రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఏళ్లు గడుస్తున్నా ఇవ్వటం లేదు. తనకు ఉన్న భూమిని అమ్మి ఇస్తానని నమ్మబలికాడు. ఇటీవల వినయ్ తన భూమిని అమ్ముకున్నాడు. అయినా కూడా ప్రదీప్‌కు ఇవ్వాల్సిన రూ.5లక్షల అప్పు తిరిగి ఇవ్వలేదు. దీంతో మృతుడు ప్రదీప్ బుధవారం సాయంత్రం 6 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుండి భార్య శ్రావణి, తల్లి ఉపేంద్రకు చెప్పి వెళ్లాడు. రాత్రి 9గంటలకు భార్య శ్రావణికి ఫోన్ చేసి వినయ్‌తో ఫోన్‌లో డబ్బుల విషయమై గొడవ జరిగిందని తెలిపాడు. ఇవ్వాల్సిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగినందుకు పథకం ప్రకారం ప్రదీప్‌పై దాడి చేసేందుకు పెసరు వినయ్ తన మిత్రుడు కాసరబోయిన గోపితో కలిసి కడిపికొండ నుంచి అయోధ్యపురం వెళ్లేదారిలో బుధవారం అర్ధరాత్రి గొడ్డలితో దాడి చేసి ముళ్లపొదల్లో ప్రదీప్‌ను పడేసి పారిపోయినట్లు తెలిపారు. గురువారం ఉదయం ప్రదీప్ భార్య శ్రావణి ప్రదీప్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అయోధ్యపురం వైపు వెళ్తున్న స్థానికులు ముళ్లపొదల్లో వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లి ఉపేంద్ర, భార్య శ్రావణిలు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రదీప్ మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జిర్ర ప్రదీప్(ఫైల్)

వైరల్‌గా మారిన వీడియో..

ముళ్లపొదల్లో పడి ఉన్న ప్రదీప్‌ను గుర్తించిన స్థానికులు, బంధువులు ఘటన ఎలా జరిగిందనే విషయాన్ని ప్రదీప్‌ను అడుగగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ వినయ్, గోపిలు దాడి చేశారని తెలిపాడు. ప్రదీప్ చివరి క్షణంలో తెలిపిన మాటల వీడియో వైరల్‌గా మారడమే కాక మరణ వాంగ్మూలంగా మారిపోయింది. చనిపోయిన కొడుకుపై పడి తల్లి ఉపేంద్ర కొడుకా నీకు నిండు నూరేళ్లు నిండిపోయాయా మేము ఎలా బతకాలని ఏడ్చిన తీరు పలువురిని కలచి వేసింది.

న్యాయం చేయాలని..

● వృద్ధ దంపతుల ఆందోళన

తొర్రూరు: వృద్ధాప్యంలో ఉన్న తమను కుమార్తెలు వేధిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వృద్ధ దంపతులు అక్కిరెడ్డి సత్తిరెడ్డి, సోమనర్సమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం మండల పరిధిలోని దంతాలపల్లి రామానుజపురం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఆందోళన చేపట్టారు. వృద్ధాప్యంలో తమను పట్టించుకోని కుమార్తెల గిఫ్ట్ డీడ్ భూమి రద్దు చేయాలని ఆర్డీఓ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నలుగురు కుమార్తెలకు వివాహాలు చేసి 9.27 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ కింద పట్టా చేశామని తెలిపారు. వృద్ధాప్యంలో తమ అవసరాల నిమిత్తం 3–36 ఎకరాలు ఉంచుకున్నామని, నలుగురు కుమార్తెల్లో ముగ్గురు తమను పట్టించుకోవడం లేదన్నారు. అనారోగ్యం బారిన పడి అవస్థలు పడుతున్నా తమ బాగోగులు చూసుకున్న చిన్న కుమార్తెకు తమ వద్ద ఉంచుకున్న భూమి విక్రయించడంతో మిగితా కుమార్తెలు తమపై దాడికి దిగుతున్నారన్నారు. యోగక్షేమాలు చూడని కుమార్తెల గిఫ్ట్ డీడ్ భూమి రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న వృద్ధ దంపతులు

తాగిన మైకంలో పొలంలో పడి వ్యక్తి మృతి

రాయపర్తి: తాగిన మైకంలో వ్యవసాయ పొలంలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కొండూరులో గురువారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బండారి రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బక్క శ్రీను(30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో బర్రెకు నీళ్లు తాగించేందుకు వెళ్లి పొలంలోనే పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

90 కిలోల నల్లబెల్లం స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

తొర్రూరు: గుడుంబా తయారీ కేంద్రాలపై దాడి చేసి 90 కిలోల నల్లబెల్లంతో పాటు పానకాన్ని ధ్వంసం చేసి పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరద శ్రీనివాసులు తెలిపారు. డివిజన్ కేంద్రంలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని అమర్‌సింగ్ తండాలో గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 90 కిలోల నల్లబెల్లం, 15 లీటర్ల నాటు సారా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది రబ్బానీ, యాదగిరి, వెంకటేశ్వర్లు, సోమేశ్వర్‌రావులు పాల్గొన్నారు.

పత్తి, గృహోపకరణాలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న దృశ్యం

కేసముద్రం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఇంట్లో ఉన్న పత్తి, గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రంగాపురంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల పాపయ్య ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న పత్తి, గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. వ్యవసాయ పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని ఇంటికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే 15 క్వింటాళ్ల పత్తితో పాటు, ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియ రాలేదు.

ఫైనల్స్‌కు చేరిన ‘సాక్షి’ క్రికెట్ పోటీలు



మొదటి మ్యాచ్ విజేత నిట్



రెండో మ్యాచ్ విజేత వాగ్దేవి కళాశాల

● పోటీలను ప్రారంభించిన ఏసీపీ గిరికుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో ఆరు రోజులుగా హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం సెమీఫైనల్ మ్యాచ్‌లో పలు జట్లు తలపడగా శుక్రవారం నిర్వహించే ఫైనల్‌కు సీనియర్ విభాగంలో వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, నిట్ కళాశాల జట్లు ఎంపికయ్యాయి. జూనియర్ విభాగంలో ఎల్బీ కళాశాల జట్టు, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల జట్లు ఎంపికయ్యాయి.

క్రీడాపోటీలతో మానసిక స్థైర్యం

క్రికెట్ మ్యాచ్‌ను గురువారం వరంగల్ ఏసీపీ గిరికుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఉదయం మొదటి మ్యాచ్ నిట్ వర్సెస్ బిట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెల్చుకున్న నిట్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బిట్స్ కళాశాల జట్టు 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 72 పరుగులు సాధించింది. అనంతర బ్యాటింగ్ చేసిన నిట్ జట్టు 6.3 ఓవర్‌లలో లక్ష్యాన్ని ఛేదించింది.

రెండవ మ్యాచ్‌లో..

రెండవ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, ఆర్ట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెల్చుకున్న వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్‌లలో ఐదు వికెట్ల నష్టానికి 81 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ అండ్ కళాశాల 8 వికెట్ల నష్టానికి 62 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో 19 పరుగులు తేడాతో వాగ్దేవి కళాశాల జట్టు విజయం సాధించింది.



క్రికెట్ మ్యాచ్ ఆడుతూ..

విద్యానగర్‌లో దొంగల సంచారం..

● కారు చోరీకి యత్నం.. పట్టుకున్న కాలనీవాసులు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్‌లో రాత్రి సమయంలో దొంగల సంచారం ఎక్కువైంది. ఇటీవల ఫోర్ట్‌రోడ్డు–1, 2 వీధుల్లో పగలు, రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తం అయ్యారు. బుధవారం రాత్రి కాలనీ కమిటీ ప్రతినిధులు స్థానిక ప్రజల సహకారంతో మట్టివాడ రజినీష్, తడక చంద్రమౌళి, రవి, రాజేష్ టీమ్‌గా ఏర్పడి రోడ్డుపై నిఘా వేశారు. 12.40గంటలకు వాహనాల దొంగలు కాలనీలోకి ప్రవేశించి ఓ కారును స్టార్ చేసే క్రమంలో స్థానికుల రాకను గమనించి ముగ్గురు పారిపోగా ఒక్కరు పట్టుపడ్డారు. అతనికి దేహశుద్ధి చేసి గురువారం తెల్లవారు జామున 2గంటలకు మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు కాలనీ ప్రతినిధి ఎనుకంటి రాజు తెలిపారు.

పల్లగుట్టలో పట్టపగలే..

చిల్పూర్: మండల పరిధిలోని పల్లగుట్టలో గురువారం పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బంగారంతో పాటు కొంత నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు వేల్పుల కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కుమార్ రోజు మాదిరిగానే ఉదయం భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి వ్యవసాయ భావి వద్దకు వెళ్లారు. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లగా వస్తువులు చిందరవందరంగా కనిపించాయి. వారు దాచుకున్న 3 తులాల బంగారంతో పాటు కొంత నగదు పోయినట్లు తెలిపారు. వెంటనే స్థానిక ఎస్సై బొల్లం వినయ్‌కుమార్‌కు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశాడు.



పట్టుబడిన దొంగ